

అగ్ని ప్రమాదం

పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల కార్తికేయ నగల దుకాణంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది.

- 8లో



క్యాన్సర్ ఆస్పత్రిని నాణ్యంగా నిర్వహించాలి

- 8లో

డాక్టర్ విజయశ్రీ క్యాన్సర్ ఆస్పత్రిని అత్యంత నాణ్యంగా నిర్వహించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు.

నేడు పీజీఆర్ఎస్‌కు జేసీ హాజరు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జాయింట్ కలెక్టర్ శోభిక హాజరు కానున్నారని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవచ్చన్నారు. అధికారులంతా విధిగా హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

తేమ శాతం సడలించాలి

పార్వతీపురం: ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు జిల్లాలోని పలువురు రైతులకు చెందిన వరి చేను తడిసి ముద్దవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మినాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా వరి నూర్పులు చేసినప్పటికీ తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు పలు ఆంక్షలు విధిస్తున్నారన్నారు. తేమ శాతం 30శాతం వరకు సడలింపు ఇవ్వాలని, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. రైతులు ఇప్పటికే వ్యాపారుల ఆంక్షలను భరించలేక దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోయారన్నారు. ప్రభుత్వం రైతుల దుస్థితిని పరిగణనలోకి తీసుకొని ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉదారంగా కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వదలని గజరాజులు



మరుపెంట సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం, సుంకి, మరుపెంట తదితర గ్రామాల్లో గత నాలుగు రోజుల నుంచి గజరాజులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఆదివారం మండలంలోని సుంకి-మరుపెంట గ్రామాల మధ్య పంట పొలాల్లో సంచరిస్తూ కనిపించాయి. పంటలను ధ్వంసం చేసి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. ఎప్పుడు ఎవరికి హాని తలపెడతాయోనని ప్రజలు కంటిమీద కునుకు లేకుండా భయాందోళనలకు గురవుతున్నారు. పంట పొలాలకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులు సుంకి, సంతోషపురంలో వరి, మొక్కజొన్న, అరటి పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. గజరాజులను తరలించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ప్రభుత్వ కార్యదర్శి నాయక్



పైడితల్లి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నాయక్ దంపతులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వేదపండితులు నాయక్ దంపతులకు వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ కెఎన్‌వీడీ.ప్రసాద్ పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూజలు



స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయం తదితర హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో తిరుప్పావై ఉపన్యాసాలు చదివి వినిపించారు. అర్చకులు సాయి రామాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, పవన్, రామగోపాల్ పాల్గొన్నారు.

గుదిబండగా.. గిరిజన గురుకులాల్లో టెన్త్ సిలబస్



మల్లి గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

- పూర్తి కాని పదో తరగతి పాఠాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు
- ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదల
- రివిజన్ చేసేదెప్పుడు?
- అవుట్ సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్ సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు అవస్థలు
- ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం

జిల్లాలో గురుకుల పాఠశాలలు : 10
టెన్త్ విద్యార్థులు : దాదాపు 800 మంది
పబ్లిక్ పరీక్షలు : మార్చి 17 నుంచి
సిలబస్ పూర్తి చేయాల్సిన సమయం : డిసెంబర్
రివిజన్ : జనవరి నుంచి
సమ్మెలో ఉన్న అవుట్ సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్ : 200 మంది
ఎన్నాళ్లుగా సమ్మెలో.. : 35 రోజులుగా..

సీతంపేట: గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు గడిచిన నెల రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం కిమ్మనకుండా ఉంది. దీంతో విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పైగా చదువులు లేకుండా కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ప్రభావం టెన్త్ సిలబస్‌పై పడింది. 200 మంది అవుట్ సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్ సమ్మెలోఉన్నారు. వీరిలో టెన్త్ క్లాస్ తరగతులు బోధించే వారు ఉండడంతో పాఠశాలల్లో ఉన్న అరకొర రెగ్యులర్ ఉపాధ్యాయులతో కాలం వెళ్లదీస్తున్నారు. వాస్తవానికి ఈ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది. జనవరి నుంచి రివిజన్ చేయాలి. ప్రతీ రోజు జరిగే స్టడీ అవర్స్‌తో పాటు ప్రత్యేకంగా రానున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా అదనంగా వేకువజామున 5 గంటల నుంచి 6 వరకు, రాత్రి సమయంలో 7 గంటల నుంచి పది గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. ఈ సమయంలో ప్రత్యేక క్లాసులు, టెస్టులు ఉంటాయి. ఇవన్నీ పూర్తి చేయాలంటే తప్పనిసరిగా ఉపాధ్యాయులు ఉండి తీరాల్సిందే. పోనీ ఆశ్రమ పాఠశాలల నుంచి డెప్యుటేషన్‌పై కొంతమంది రెగ్యులర్ స్టాఫ్‌ను వేసారంటే వారిని కూడా టీజీటీ, పీజీటీ స్థాయి కాకుండా కేవలం ఎస్‌జీటీలతో సరిపెట్టారు. వీరు పదో తరగతి బోధన చేయడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో టెన్త్ సిలబస్ గుదిబండగా మారడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సిలబస్సే ఇప్పటి వరకు పూర్తి కాకుంటే రివిజన్ ఎప్పుడవుతుందో తెలియని పరిస్థితి. కొన్ని పాఠశాలల్లో మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులతో బోధన సాగుతుంది. మరికొన్ని పాఠశాలల్లో ఎటువంటి బోధన లేకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో సీతంపేట, పార్వతీపురం మన్యం ఐటీడీఏల పరిధిలో మొత్తం 10 గిరిజన గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల మంది విద్యార్థులు 3 నుంచి పది తరగతులు చదువుతున్నారు. వీరిలో టెన్త్ విద్యార్థులు 800 మంది వరకు చదువులు సాగిస్తున్నారు. ఇప్పటికే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. దీన్ని బట్టి చూస్తే సంక్రాంతి సెలవులు పోను 45 రోజులు కూడా పరీక్షలకు సమయం లేదు. ముఖ్యమైన గణితం, ఇంగ్లిష్, సైన్సు వంటి పాఠాలు సిలబస్ ఇంకా 30 శాతం వరకు పూర్తి చేయాల్సి ఉందని విద్యార్థులు చెబుతున్నారు. సకాలంలో సిలబస్ పూర్తి కాకపోవడంతో తమ పిల్లల చదువులు ఏమైపోతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటికే దాదాపు 90 శాతం సిలబస్ పూర్తయింది. రోజూ ఉదయం, సాయంత్రంతో పాటు, సెలవు దినాల్లోనూ ప్రత్యేక తరగతులు పెట్టుకుని బోధిస్తుండడంతో సిలబస్ పూర్తి కావచ్చింది. గురుకుల పాఠశాలల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉండడం గమనార్హం.

మా సమస్యలు పరిష్కరించండి



మా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించాలని కోరాం. ఇంతవరకు ఎటువంటి స్పందన లేదు. ఇప్పటికైనా స్పందించాలి.

– బి.గణేష్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తరగతులు పూర్తిగా జరగడం లేదు



తరగతులు పూర్తిగా జరగడం లేదు. కొన్ని క్లాసులు మాత్రమే బోధిస్తున్నారు. ఇంకా కొన్ని పాఠాలు బోధించాల్సి ఉంది. రివిజన్ చేయాలి. అప్పుడే మంచి ఫలితాలు సాధించగలం.

– ఎస్.సురేంద్ర, టెన్త్ విద్యార్థి, మల్లి పీవీటీజీ గురుకులం

తెలుగు కొత్త సిలబస్ చెప్పాలి



గురుకులంలో తెలుగు సబ్జెక్టు మొదట్లో పాత సబ్జెక్టు ఉండేది. సెప్టెంబర్ నుంచి కొత్త సిలబస్ మార్చారు. కేవలం రెండు నెలల్లో కొన్ని పాఠాలు బోధించడం జరిగింది. ఇప్పుడు చాలా ఎక్కువ సిలబస్ బోధించాల్సి ఉంది. మా సమస్య ఎంత వేగంగా పరిష్కరిస్తే అంత త్వరగా పాఠశాలలకు వెళ్లి సిలబస్ కంప్లీట్ చేసి రివిజన్ చేస్తాం.

– నిమ్మక జయరాజ్, తెలుగు అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడు

చదువులు సాగడం లేదు..



గిరిజన గురుకులాల్లో చదువుతున్న మా పిల్లలకు చదువులు సరిగా సాగడం లేదు. కేవలం భోజనాలు మాత్రమే పెడుతున్నారు. ఎంత కాలం ఇలా చదువులు లేకుండా ఉంచాలి. నెల రోజులు పూర్తయినా ఉపాధ్యాయులు లేకుండా పాఠశాలలు నడపడం తగదు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు న్యాయం చేసి మా పిల్లలకు చదువులు చెప్పించాలి.

– కె.శ్రీదేవి, పేరెంట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్, గడిగుడ్డి

సినీ గేయ రచయితగా రామారాయపురం యువకుడు

- గ్రామీణ ప్రాంతం నుంచి సినీ పరిశ్రమ వైపు అడుగులు
- ఇప్పటి వరకూ 21కి పైగా పాటలు రచించిన చిరంజీవి



యెన్ని చిరంజీవి

రాజాం/సంతకవిటి :

అతనొక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు. అంతంత మాత్రంగానే ఆర్థిక స్థోమత ఉండడంతో డిగ్రీ పూర్తి చేసి ఉపాధి వైపు దృష్టి సారించాడు. ఒక వైపు ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తూ మరో వైపు మ్యూజిక్ డైరెక్టర్లకు పాటలు రచించి అందజేస్తున్నాడు. గత మూడేళ్ల కాలంలో 21కి పైగా సినీ పాటలు రచించి ఔరా అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే..

సంతకవిటి మండలం రామారాయపురం గ్రామానికి చెందిన యెన్ని చిరంజీవి ఇటీవల హాట్ టాపిక్‌గా మారాడు. అయోధ్య శ్రీరామ మందిర ఆల్బమ్‌కు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఎస్పీ ప్రొడక్షన్‌లో సమీర్ పిలకలపాటి నిర్మిస్తుండగా ఇందులో 'అయోధ్య శ్రీరామ రూపం...ధరణీ దర్శన పుణ్యతీర్థం' పాటను చిరంజీవి రచించారు. ఈ పాటను సత్య కశ్యప్, స్నికిత, శ్రావ్యలు ఆలపించారు. ప్రస్తుతం ఈ పాట సామాజిక మాధ్యమాల్లో కోట్లాది మందిని సొంతం చేసుకోంది. ఈ పాటను హిందీలో తన్వీర్‌గజ్వీ రచిస్తున్నారు. దీంతో చిరంజీవి పేరు తెరపైకి వచ్చింది.

చిరంజీవి విశేషాలు

చిరంజీవి 1నుంచి 5వ తరగతి వరకూ రామారాయపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి పది వరకూ మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సంతకవిటి జూనియర్ కళాశాలలో, డిగ్రీ(బీఏ) శ్రీకాకుళంలో హెచ్‌పీఎల్ కళాశాలలో పూర్తి చేసారు. డిగ్రీ అనంతరం కంప్యూటర్ వర్క్స్ పూర్తి చేసారు. సినీ పాటలపై మక్కువతో హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కొన్నాళ్లు ఉండి అవకాశాలు లేక తిరిగి ఇంటిముఖం పట్టాడు. పొందూరు సమీపంలో ఓ ప్రైవేట్ కంపెనీలో చేరిన చిరంజీవి తన పట్టుదల వదలలేదు. ఖాళీ సమయాల్లో పాటలు రాయడం, మ్యూజిక్ డైరెక్టర్లకు పంపించడం చేస్తున్నాడు. ఇందులో భాగంగా ఇటీవల ఈయన రచించిన పాటలు సినిమాలకు, వెబ్ సిరిస్‌లకు వినియోగించి, చిరంజీవికి పారితోషికం అందించారు. చిరంజీవి తల్లిదండ్రులు కళావతి, కృష్ణమూర్తిలు రోజువారీ కూలీలు.

ఇప్పుడిప్పుడే..

చిరంజీవి రచించిన పాటలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ సత్య కశ్యప్, సినీ డైరెక్టర్ సీపాన శ్రీధర్‌లు చిరంజీవికి అవకాశాలు కల్పించారు. సత్యకశ్యప్ వైకల్యాం సినిమాకు సంబంధించి 'వనవాసమేలే సీతమ్మలా' అనే లిరిక్‌తో కూడిన చిరంజీవి రచించిన పాట హిట్ అయ్యింది. ఈ పాటను దివ్య మాలిక్ గానం ఆలపించారు. ఈ సినిమాలో ఇంకో పాట సుద్దాల అశోక్‌తేజ రాయడం జరిగిందని చిరంజీవి వెల్లడించారు. ఇటీవల హ్యాపీ ఎండింగ్ వెబ్ సిరీస్‌కు ఒక పాటను అందించిన చిరంజీవి అంతకు ముందు పది సినిమాలకు, వెబ్ సిరీస్‌లకు పాటలు అందించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులకు పాటలు రచించి ఔరా అనిపించుకున్నాడు. రేలారే రేలా రఘు అనే కళాకారునికి సైతం పాటను రచించి అందించినట్లు చిరంజీవి తెలిపాడు. గత మూడేళ్లలో తాను రాసిన 21 పాటలు హిట్ అవ్వడమే కాకుండా మంచి పేరు తీసుకొచ్చాయని, జనవరిలో కొత్త సినిమా ఆఫర్ ఉందని.. అందులో రెండు పాటలకు అవకాశం ఇస్తున్నట్లు నిర్మాతలు తెలిపారని చెప్పాడు.

ఇద్దరికి మెమోలు

సీతంపేట: మల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబులకు మెమో ఇచ్చినట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లి పాఠశాల విద్యార్థులు శనివారం ఐటీడీఏ వద్దకు వచ్చి ఆందోళన చేయడంతో ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు మెమో ఇచ్చినట్టు తెలిపారు.

త్రిపుర హైకోర్టులో పెండింగ్ కేసుల్లేవు..

- కోర్టుకు తాళం వేసి వచ్చా..
- ఈ పరిస్థితి దేశం అంతా ఉండాలి..
- త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అమర్‌నాథ్‌గౌడ్



కొత్తవలస :

త్రిపుర హైకోర్టులో ఎటువంటి కేసులు పెండింగ్‌లో లేవని, కోర్టుకు తాళం వేసి వచ్చానని ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.అమర్‌నాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అక్కడ పెండింగ్‌లో ఉన్న 65 శాతం కేసులను పరిష్కరించానని తెలిపారు. వరుసగా నాలుగైదు రోజులు కేసులు లేకపోవడంతో కోర్టుకు తాళం వేసి ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితి దేశం అంతా ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. తాను గతంలో ప్రపంచ రికార్డులో భాగంగా భారతదేశం నుంచి 92 వేల కేసులకు తీర్పులు చెప్పానని, రోజుకు సరాసరి 109 కేసులకు సంబంధించి జడ్జిమెంట్లు ఇచ్చానని తెలిపారు. ఇందులో కేవలం 19 కేసులు మాత్రమే సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లాయని చెప్పారు. దీన్ని బట్టి కక్షిదారులు, న్యాయవాదులు ఎంత సంతోషకరంగా ఉన్నారో అర్థం చేసుకోవాలన్నారు. ఇది తనకు ఎంతో ఆత్మ సంతృప్తి ఇచ్చిందన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో 2 లక్షల 30 వేల కేసులు పెండింగ్‌లో ఉంటే 88 వేల కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. లిటిగేషన్ లేని కోర్టు, పేషంట్ లేని ఆస్పత్రులు, వృద్ధుల్లేని వృద్ధాశ్రమాలు ఉండాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

నేడు శంబర పెదపోలమాంబ అమ్మవారి చాటింపు

- 30న గ్రామానికి చేరుకోనున్న పెదపోలమాంబ
- వచ్చే ఏడాది జనవరి 27, 28, 29 తేదీలలో అమ్మవారి జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ మేనత్త పెదపోలమాంబ అమ్మవారు సనప చాటింపు సోమవారం జరగనుంది. సోమవారం నుంచి శంబర గ్రామంలో పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ప్రారంభం కానుంది. ఆనవాయితీ ప్రకారం సోమవారం గ్రామస్తులంతా సమావేశమై, పెద్ద అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు సనప చాటింపు వేస్తారు.

30న పెద్ద అమ్మవారిని కొనితెచ్చుట

శంబర గ్రామం నుంచి ఎస్.పెద్దవలస గ్రామానికి వెళ్లే రహదారి వద్ద పూజలు నిర్వహించి, పోలమాంబ మేనత్త పెద్ద పోలమాంబ అమ్మవారిని ఈ నెల 30వ తేదీన గ్రామంలోని పెద్ద అమ్మవారి ఆలయంలోకి భాజాభజంత్రుల నడుమ అమ్మవారిని తీసుకువస్తారు. అమ్మవారు గ్రామంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. వచ్చే ఏడాది జనవరి 6న తొలేళ్ల ఉత్సవం, 7న పెద్ద పండగ, 8న అనుపోత్సవం నిర్వహిస్తారు.

జనవరి 8న పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు సాటింపు

వచ్చే ఏడాది జనవరి 8వ తేదీన పెదపోలమాంబ అమ్మవారిని అనుపోత్సవం నిర్వహించిన అనంతరం శంబర పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు గ్రామంలో చాటింపు వేస్తారు. జనవరి 13వ తేదీన గోముఖీ నది ఒడ్డున పూజలు నిర్వహించి, పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకువస్తారు. 14వ తేదీన అమ్మవారు చదురుగుడిలో విశ్రాంతి తీసుకొని, 13 రోజుల పాటు గ్రామంలోని చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తూ, సాయంత్రం వేళల్లో గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. జనవరి 27వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు.



పర్యావరణ పరిరక్షణకే సైకిల్ యాత్ర

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు చెందిన ముత్తు చిల్వాన్ ఆసియా దేశాల పర్యటనకు సైకిల్ యాత్ర చేపట్టాడు. యాత్రలో భాగంగా మండలంలో ఖడ్గవలస జంక్షన్‌కు ఆయన ఆదివారం చేరుకున్నాడు. స్థానికులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. సైకిల్ యాత్రను 2021 డిసెంబర్ 28న ప్రారంభించినట్టు తెలిపారు. చిల్వాన్‌ను పలువురు అభినందించారు. - గరుగుబిల్లి





పార్వతీపురం : బెలగాంలోని విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చి

సర్వాంగ సుందరంగా చర్చిలు

క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవ చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పార్వతీపురం పట్టణంలోని బెలగాంలో చర్చిని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పాలకొండ పట్టణంలోని లూర్ధుమాత దేవాలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. వీటితో పాటు పట్టణంలోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. -పార్వతీపురం/పాలకొండ రూరల్



పాలకొండ రూరల్: క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన పాలకొండలోని లూర్ధుమాత చర్చి

క్లుప్తంగా

పర్యాటక డీఎంగా దివ్యాంగుల శాఖ జగదీష్

విజయనగరం అర్బన్: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ విశాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్‌ల శాఖ సహాయ సంచాలకుడు జీవీ బీగ జదీష్ నియమితులయ్యారు. పర్యాటక అభివృద్ధి సంస్థకు సంబంధించి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించనున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడిగా ఆయన జిల్లాలో దివ్యాంగుల కోసం అందించిన సేవలకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సహకారంతో మెగా శిబిరాలు నిర్వహించి జిల్లాలో ఒకేసారి 2,338 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.3.25 కోట్లు విలువ చేసే బ్యాటరీతో నడిచే మోటార్ సైకిల్స్, ఇతర ఉపకరణాలు రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆయన అందించారు. విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎ.డిగా ఆయన స్థానంలో ఆ శాఖ అధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు.



విశాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా జీవీ జగదీష్

సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు శంకరరావు ఎంపిక

నెల్లిమర్ల: దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 3వతేదీ నుంచి ఆరు రోజుల పాటు జరగనున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన కాళ్ల శంకరరావు ఎంపికయ్యారు. మండలంలోని మొయిద గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శంకరరావు అఖిల భారత కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం ఇది మూడో సారి. ఈ పోటీల్లో శంకరరావు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీల్లో శంకరరావు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. శంకరరావు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), ఎంపీపీ అంబళ్ల సుధారాణి, మొయిద, పూతికపేట గ్రామాల సర్పంచ్‌లు అట్టాడ కృష్ణ, లెంక మంగమ్మ, ఎంపీటీసీ పెనుమత్స సంతోష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్. మోహనరావు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ బి.రామారావు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.



కాళ్ల శంకరరావు

250 మద్యం బాటిల్స్ పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిల్స్‌తో పోలీసులు

మెరకముడిదాం: మండలంలోని భైరిపురం జంక్షన్ వద్ద శనివారం అర్ధరాత్రి బైక్‌పై 250 మద్యం బాటిల్స్ తరలిస్తుండగా విజయనగరానికి చెందిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బుదరాయవలస పోలీసులు పట్టుకున్నారు. మద్యం బాటిల్స్‌ను తరలిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయడంతో పాటు వారి దగ్గర నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ అంజిబాబు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకార్డులకు మోక్షమెప్పుడో...?

పార్వతీపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఇంతవరకు ఒక్కరికి కూడా కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయలేదు. డిసెంబర్ మొదటి వారంలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారం సాగడంతో అర్హులైన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సిబ్బంది చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొంతమంది సచివాలయ సిబ్బంది దరఖాస్తులను స్వీకరిస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో సచివాయలంలోనే దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయడంతోపాటు పాత కార్డులలో చేర్పులు మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కానీ ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాకపోవడంతో అర్హులకు భంగపాటు తప్పలేదు. కొత్త రేషన్‌కార్డులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసేంతవరకు అర్హులు వేచి చూడాల్సిందే మరి.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200



బాలింతలకు వైద్యసేవలందిస్తున్న స్టాఫ్‌నర్స్ ఉష



రామభద్రపురం పీహెచ్‌సీ

భయం భయంగా వైద్య సేవలు

- రామభద్రపురం పీహెచ్‌సీలో ప్రశ్నార్థకంగా రాత్రిపూట విధులు
- సిబ్బందికి సెక్యూరిటీ సమస్య
- పట్టించుకోని వైద్యారోగ్యశాఖ

రామభద్రపురం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రాత్రి పూట వైద్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. కనీస భద్రత లేకుండా తాము వైద్యం చేయలేమంటూ సిబ్బంది తెగేసి చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేసే సిబ్బందికి భద్రత ఏర్పాట్లపై ఆ శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 24 గంటల స్థాయి కలిగిన ఈ ఆస్పత్రిలో రాత్రి పూట భద్రత లేనిదే వైద్యం చేయలేమని సిబ్బంది వాపోతున్నారు. అంతరరాష్ట్ర కూడలి అయిన మండలకేంద్రంలో జాతీయ రహదారి ఉండడంతో ఈ రహదారిలో ప్రమాదాలు జరుగుతుండం వల్ల బాధితులు ఆస్పత్రికి వస్తుంటారు.అలాగే స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వారు, ఇతర ప్రాంతాలకు చెందిన రోగులు వైద్యం కోసం నిత్యం పదుల సంఖ్యలో ఆస్పత్రికి వస్తుంటారు. వారిలో ఎవరు ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేని పరిస్థితి ఉంది. దీంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉన్న స్థానిక పీహెచ్‌సీలో పటిష్ఠ భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. పీహెచ్‌సీల్లో భద్రతా సిబ్బందిని నియమించకపోవడంతో కూటమి ప్రభుత్వంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి భద్రత సిబ్బందిని నియమించాలని వైద్యసిబ్బంది పక్షాన స్థానికులు కోరుతున్నారు.

భద్రతపై నిర్లక్ష్యమెందుకు?

స్థానిక పీహెచ్‌సీలో రాత్రి వేళల్లో కచ్చితంగా వైద్య సిబ్బంది వైద్యం చేయాల్సిన పరిస్థితి. ఆస్పత్రి భవనం జాతీయ రహదారికి కొంత లోపలికి ఉంది. ఇక్కడ రాత్రి వేళల్లో ఒక మహిళా సాఫ్‌నర్స్, అటెండర్ మాత్రమే విధుల్లో ఉంటారు. వైద్యం కోసం వచ్చే వారిలో అత్యధికంగా మద్యం తాగిన వారే ఉంటారు. దీంతో వైద్యం కోసం వచ్చేవారు విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బందిపై మద్యం మత్తులో దుర్భాషలాడుతున్నారు. ఆ సమయంలో ఏ జరుగుతుందోనని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

ఇటీవల ఓ వ్యక్తి వీరంగం..

ఇటీవల డెలివరీ కోసం ఓ గర్భిణిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెతో పాటు కుటుంబసభ్యులు వచ్చారు.అందులో ఓ వ్యక్తి ఫుల్‌గా మద్యం తాగి ఆస్పత్రిలో డెలివరీ చేసిన స్టాఫ్‌నర్స్‌పై వీరంగం వేశాడు.నానా బూతులు తిట్టాడు, ఆమె భయపడి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆఖరికి పోలీసులు వచ్చి గట్టిగా గదమాయించిన తర్వాత వెళ్లిపోయాడు. ఈ ఆస్పత్రిలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయని, రాత్రి పూట వైద్యసేవలందించే స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాత్రి పూట భద్రత లేనిదే వైద్యం చేయలేమని వాపోతున్నారు.

ప్రభుత్వానికి విన్నవించాం..



24 గంటల స్థాయి కలిగిన స్థానిక పీహెచ్‌సీకి రాత్రుల్లో భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బంది అవసరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులకు విన్నవించాం. వారు పరిశీలన చేస్తున్నారు.ప్రస్తుతం సెక్యూరిటీ సిబ్బంది లేనిది చాలా ఇబ్బందికరంగా మారుతోంది. రాత్రివేళల్లో వైద్యసిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రి వేళల్లో తాము విధులకు రాలేమంటూ స్టాఫ్‌నర్స్‌లు తెగేసి చెబుతున్నారు. తమ ఇబ్బందులను జిల్లా అధికారులు గుర్తించి తక్షణమే సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని కోరుతున్నాం.

దిలీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి,రామభద్రపురం

క్యాన్సర్ ఆస్పత్రిని నాణ్యంగా నిర్వహించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న త్రిపుర హైకోర్టు జడ్జి, ఎంపి శ్రీభరత్ తదితరులు

- విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్

కొత్తవలస: ఒక సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని నిర్వహించడం మాటలు కాదని, నూతనంగా ప్రారంభించిన డాక్టర్ విజయశ్రీ క్యాన్సర్ ఆస్పత్రిని అత్యంత నాణ్యంగా నిర్వహించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. ఈ మేరకు కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్(యుఎస్వీ)సాయంతో నూతనంగా నిర్మించిన క్యాన్సర్ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ గురుదేవా ట్రస్టుకు తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.అమర్‌నాథ్ గౌడ్ మాట్లాడుతూ తన భార్య పేరు మీద ఉప్పలపాటి వెంకటపతిరాజు రూ.15కోట్లు పెట్టి క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించి పేదలకు బహుమతిగా ఇచ్చారని కొనియాడారు. సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి మాట్లాడుతూ గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగులకు సేవ అందించడమే కాకుండా వారికి జీవన భృతిని కూడా కల్పిస్తోందని ప్రశంసించారు.

భార్య జ్ఞాపకార్థం ఆస్పత్రి నిర్మాణం

డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్(యుఎస్‌వీ) వ్యవస్థాపకుడు ఉప్పలపాటి వెంకటపతిరాజు మాట్లాడుతూ తన భార్య మృతి చెందిందని ఆమె పేరు మీద ఒక క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి రూ.15 కోట్లు వెచ్చించి గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కేవలం ఏడు నెలల్లోనే నిర్మాణం పూర్తి చేశామన్నారు. గురుదేవా ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోనే అతి పెద్ద క్యాన్సర్ ఆస్పత్రి విజయశ్రీ ఆస్పత్రేనన్నారు. ఈ ఆస్పత్రిలో ఉచితంగా పేదప్రజలకు సేవలు అందజేస్తామన్నారు. అనంతరం మాట్లాడిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ముకుందశర్మ, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం ఎం.డి బండి సురేషకుమార్‌లు గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు, ఉప్పలపాటి వెంకటపతిరాజు ఔదార్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ప్రముఖ పారిశ్రామిక వేత్త ఇమంది శంకరరావు, గొంప కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అమర్‌నాథ్ గౌడ్

నగల దుకాణంలో అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న జ్యూయలరీ షాపు

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల కార్తికేయ నగల దుకాణంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సెలవు రోజు కావడంతో షాపు మూసి ఉండగా ఒక్కసారిగా పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు యజమాని శేఖర్‌కు సమాచారం అందించారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న లగ్నిమాక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అప్పటికే దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. షాపులో పదికిలోల వెండి ఆభరణాలు, కిలో బంగారు వస్తువులు ఉన్నాయని, వాటితో పాటు విద్యుత్ పరికరాలు, ఏసీలు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం కావడం, పండగల సీజన్‌లో జీవనోపాధి అయిన దుకాణం కాలి బూడిదవడంతో యజమానితో పాటు పనివారు కన్నీరు పెట్టుకున్నారు. సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న సీఐ మీసాల చంద్రమౌళితోపాటు, అగ్నిమాపక ఎస్సై జామి సర్వేశ్వరావు, విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనపై ఆరా తీశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

సెరిబ్రల్ మలేరియాతో వ్యక్తి మృతి

- మృతుడి కుమారుడి పరిస్థితి విషమం



సెరిబ్రల్ మలేరియాతో మృతి చెందిన హరిబాబు

వీరఘట్టం: మండలకేంద్రంలోని సెడిగివీధికి చెందిన ఉండ్రాళ్ల హరిబాబు, కుమారుడు విష్ణువర్ధన్ రాజులకు మలేరియా జ్వరం రావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తండ్రి హరిబాబు(35) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఏడాదిన్నర వయస్సు గల విష్ణువర్ధనరాజు ఐసీయులో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. హరిబాబు వీరఘట్టంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పనిచేసేవాడు. ప్రభుత్వ మద్యం దుకాణాలను కూటమి ప్రభుత్వం ఎత్తివేయడంతో ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడు. ఏదైనా ప్రైవేట్ ఉద్యోగంలో చేరేందుకు ఇటీవల ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నాడు.ఇంతలో ఈనెల 16న జ్వరం రావడంతో వీరఘట్టంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మూడు రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. అలాగే తన ఏడాదిన్నర కుమారుడికి కూడా జ్వరం రావడంతో ఇదే ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. వారిద్దరికీ జ్వరం తీవ్రత తగ్గకపోవడంతో ఈనెల 19న శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బంధువులు చేర్పించారు. వైద్య పరీక్షలు చేయగా హరిబాబుకు సెరిబ్రల్ మలేరియా ఉన్నట్లు రిపోర్ట్‌లో తేలింది. అలాగే ప్లేట్‌లెట్స్ కూడా తగ్గిపోవడంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. ఇంతలోనే ఈనెల 20న కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈనెల 21న రోజంతా హరిబాబును వెంటిలేటర్‌పై ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా కుమారుడు విష్ణువర్ధన రాజు ఐసీయూలో విషమ పరిస్థితుల్లో చికిత్స పొందుతున్నాడు. ఓ వైపు భర్త చనిపోవడం, మరో వైపు కొడుకు చావుబతుకులతో పోరాడు తుండడంతో మృతుడి భార్య హిమశ్రీ తల్లడిల్లిపోయింది.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక ప్రసాద్‌నగర్‌కు చెందిన శ్రీపతి మురళీకృష్ణరావు (60)బైక్‌తో డివైడర్‌ను ఢీకొని ఆదివారం మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం ఆయన టిఫిన్ కొనుగోలు చేసేందుకు వీటీ అగ్రహారం బైక్‌పై వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రక్తపోటు ఎక్కువవడంతో బైక్ రేజింగ్ ఇచ్చేశారు. దీంతో పక్కనే ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టి పడిపోగా తలకు తీవ్రగాయం కావడంతో రక్తస్రావం ఎక్కువైంది. స్థానికులందించిన సమాచారంతో 108 వచ్చి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మురళీకృష్ణ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో తీవ్రగాయాలపాలైన మురళీకృష్ణారావు



ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ సెమీఫైనల్



శ్రీ విశ్వ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సీతమ్మధార: 'సాక్షి' స్పెల్ బీ రీజినల్ సెమీఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని శ్రీ విశ్వ స్కూల్‌లో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి' వ్యవహరించాయి. వివిధ కేటగిరీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష బాగా రాశామని పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. 'సాక్షి' మీడియా అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్న 'సాక్షి' మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల మేధోశక్తిని పెంచేందుకు సాక్షి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని 'సాక్షి'బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు పర్యవేక్షించగా.. శ్రీ విశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్లు శివాజీ, సూర్యనారాయణ, డీన్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

SAKSHI SPELL Bee 2024-25

నమ్మకం కలిగింది



సాక్షి స్పెల్ బీ పరీక్ష కోసం కొద్ది రోజులుగా సన్నద్ధమయ్యాను. పరీక్ష బాగా రాశాను. దీంతో మరింత నమ్మకం కలిగింది. సబ్జెక్టును మెరుగుపరుచుకునేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి.

-ఎం.స్ఫూర్తి శ్రీ, పదో తరగతి, శర్వాణి విద్యాలయం, అరసవిల్లి, శ్రీకాకుళం

అర్థాలు తెలిశాయి



సాక్షి స్పెల్ బీ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో లోతైన అర్థాలు తెలిశాయి. స్టేజీపై మాట్లాడేందుకు మా భాషను మెరుగుపరుచుకోవచ్చు. సాక్షికి ధన్యవాదాలు.

– ఎస్.విష్ణు శ్రీప్రియ, ఏడో తరగతి, కేకేఆర్ గౌతమి స్కూల్, ఎంవీపీకాలనీ, విశాఖపట్నం,

పరీక్ష బాగా రాశాను



సాక్షి స్పెల్ బీ సెమిఫైనల్ పరీక్ష కోసం మా అమ్మనాన్నతో కలిసి వచ్చాను. పరీక్ష చాలా బాగా రాశాను. స్పెల్ బీ పరీక్షకు సిద్ధమవడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

– వి.సాయి సహన, ఐదో తరగతి, శ్రావణి విద్యాలయం, శ్రీకాకుళం

చిన్న పరిశ్రమలకు బ్యాంకర్ల సహకారం లేదు

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేద్దామనుకునే ఉత్సాహవంతులకు కొంతమంది బ్యాంకర్లు సంబంధంలేని ప్రశ్నలు వేసి ఇబ్బంది పెడుతున్నారని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలనా మంత్రి కొండపల్లి శ్రీనివాస్కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేస్తానని ప్రకటనలు ఇస్తున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న ఇద్దరు వ్యక్తులు బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో తమకున్న చిన్న పరిశ్రమను ఆధునీకరణ చెయ్యడానికి బొబ్బిలి యూనియన్ బ్యాంక్‌ను సంప్రదిస్తే గడచిన మూడు నెలలుగా తిప్పుతున్నారని ఆరోపించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం లేదన్నారు.

ప్రమాదాల నియంత్రణకు భద్రత చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైమ్: రహదారి భద్రత ప్రమాణాల పట్ల అవగాహన, ఆచరణతోనే జిల్లాలో రహదారి ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రహదారి ప్రమాదాలను నియంత్రించడంలో భాగంగా భద్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వాహనదారులకు భద్రత పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను, పెద్ద ప్రమాదాలు జరిగినప్పటికీ స్వల్పగాయాలతో ఎలా ప్రాణాలతో సురక్షితంగా బయటపడవచ్చునో వాహనదారులకు వివరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో గాలి, దుమ్ము నుంచి హెల్మెట్ రక్షించడంతో పాటు, సురక్షిత ప్రయాణాన్ని అందిస్తాయన్నారు. ఊహించని రహదారి ప్రమాదాల నుంచి రక్షించే రక్షణరేఖ వంటిది హెల్మెట్ ధారణ అని తెలిపారు. ప్రతి వాహనదారు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో నాణ్యత కలిగిన సరిగ్గా అమర్చిన హెల్మెట్స్‌ను ధరించే విధంగా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించని వారిపై ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 35,204 మందిపై ఎంవీ చలానాలను విధించామని పేర్కొన్నారు.

ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్

అధికారులు ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, వాహన తనిఖీలు చేపట్టి, ప్రజలకు, వాహనదారులకు రహదారి భద్రత, మోటారు వాహన చట్టం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాలను నియంత్రించడంలో భాగంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ చేసే వారిపై కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై దాడులు చేపట్టి, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదుచేయాలని తెలిపారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రహదారి ప్రమాదాలు జరగకుండా బ్లాక్‌స్పాట్స్‌కు ఇరువైపులా కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయడం, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లు, డ్రమ్ములు ఏర్పాటుచేసి, రాత్రి సమయాల్లో వాహనదారులకు కనిపించే విధంగా వాటిపై రేడియం స్టిక్కర్లు అతికించాలని అధికారులను ఆదేశించారు.